

రాత్రి పది దాటింది.

అప్పటికే ఊరు నిద్రలోకి జారుకుంటోంది.

ఊరికి కొద్దిగా విసిరేసినట్టున్న ఆ ఇంటిలో మాత్రం లైటు వెలుగుతోంది. నేను గబగబా అటువైపు నడిచాను. అప్పటికే చిన్నగా చినుకులు కూడా మొదలయ్యాయి. దాంతో గాల్లో తేలిపోతున్నంత వేగంగా పరిగెత్తుకెళ్లి ఆ ఇంటి బెల్ కొట్టాను. లోపల బెల్ మోగిన శబ్దం వినిపిస్తోంది. నాకయితే ఆత్రం పెరిగిపోతోంది. అసలు ఆ ఇంటి వాళ్లొచ్చి తలుపులు తెరిచేలోపే ఆ తలుపుల గుండా లోపలికెళ్లిపోవాలని ఉంది.

ఇంతలోనే తలుపులు తెరుచుకున్నాయి. ఇంతకీ తలుపులు తీసింది ఓ నలభై, నలభై అయిదేళ్ల వ్యక్తి. అంత రాత్రివేళ వర్షంలో తడుచుకుంటూ వచ్చిన నేనెవరూ అని అతడు ఆశ్చర్యంగా చూస్తున్నట్టు అనిపించింది. ఇంతలోనే "ఎవరమ్మా వచ్చింది"? అంటూ లోపలినుంచి ఓ స్త్రీ గొంతు వినిపించింది. ఆమె పేరు సుజాత అని నాకు తరువాత తెలిసింది.

# మమతల నిలయం

## ఎస్.వి. సుధాకర రెడ్డి


నేను ఒక్కసారిగా ఇబ్బందిలో పడ్డాను. నేను ఎవరని చెప్పను! అసలెందుకొచ్చానని చెప్పను!!... ఏం చెపుదామా అని ఆలోచిస్తుండగా "అది కాదమ్మా... మన వసంతక్క ఊరెళ్లినప్పుడు చెప్పింది కదా... తన ఫ్రెండ్ ఏదో టైమ్‌లో వస్తుందని. తనే అనుకుంటా" అంటూ ఇంకెవరో అనడం వినిపించింది. ఆ మాట అన్నది ఎవరాని లోపలికి తొంగిచూసాను.

ఇంతకీ ఆ మాటలన్నది సోఫాలో కూర్చున్న సుమ అనే అమ్మాయి... తనకి ఓ పదిహేనేళ్లుంటాయేమో... మొహంలో ఇంకా అమాయకత్వం పోలేదు. సుమ అలా అనేసరికి "అవునామ్మా?... నువ్వు మా వసంత స్నేహితురాలివా?" అంటూ ముందు తలుపులు తీసిన రఘురామ్ నన్నడిగాడు. నేను అవునూ, కాదూల మధ్య తలాడించాను. ఈసారి నన్ను ఎవరు ఏ ప్రశ్నలూ వేయలేదు.

రఘురామ్ ఆప్యాయంగా "లోపలికి రామ్మా" అన్నాడు. సుజాత కూడా నా చేయి పట్టుకుని లోపలికి తీసుకెళ్లి సోఫాలో కూర్చోమంది. నేను ఇంకేం మాట్లాడకుండా వెళ్ళి సుమ పక్కన కూర్చున్నాను. సుమ నన్ను చూసి పలకరింపుగా నవ్వింది. నాకెందుకో సుమ చాలా బాగా నచ్చింది. ఎలాంటి కల్మషం లేకుండా స్వచ్ఛంగా నవ్వుతోంది. ఇంతలో సుమే నావంక తిరిగి "నా పేరు సుమ. వసంత చెల్లెల్ని. ఈ తాడిగాడి పేరు భరత్, మా అన్నయ్య" అంటూ ఇంకో మూల కుర్చీలో కూర్చున్న శాల్తీని చూపించింది.

ఎవరాని నేను అటుగా చూసాను. అక్కడో ఇరవయ్యేళ్ల కుర్రాడున్నాడు. సుమ అలా అనేసరికి భరత్ పైకి లేచి ముందుగా సుమ దగ్గరకొచ్చి నెత్తిమీద ఒకటి మొట్టి తర్వాత నా దగ్గరకొచ్చి "ఏంటక్కా... వర్షంలో తడిసిపోయి వచ్చినట్టున్నావ్!" అంటూ అడిగాడు. భరత్ అలా పిలిచేసరికి నా మనసుకి చాలా ఆనందం వేసింది. నిజానికి భరత్ వయసు నాకంటే రెండు, మూడేళ్లు తక్కువుంటుందేమో. అయినా ఇప్పుడే పరిచయమయిన నన్ను ఎంత ఆప్యాయంగా పిలిచాడు...! అసలు చూస్తుంటే ఆ ఇంటి వాతావరణం లోనే ఏదో అద్భుతం ఉందనిపించింది. అందరి కళ్లూ దయని వర్షిస్తున్నాయి. ఎవరి మాటల్లోనూ కల్మషం కనిపించడం లేదు. మనసులో ఏదో పెట్టుకుని ఇంకేదో మాట్లాడటం లేదు. నాకయితే ఇంక ఎప్పటికీ వాళ్ల మధ్యే ఉండిపోవాలని ఉంది.

ఇంతలో సుజాత టవల్ తెచ్చి "ఏంటమ్మా... బాగా తడిసిపోయావ్... జలుబు చేయదూ" అంటూ తలంతా తుడవసాగింది. ఒక్కసారిగా నాకు చిన్నతనం గుర్తొచ్చింది. ఎప్పుడో పోయిన అమ్మ గుర్తొచ్చింది. దాంతో కళ్లు విచలితమయ్యాయి. ఇంతలో హఠాత్తుగా నేనున్న పరిస్థితి గుర్తొచ్చింది. నా పాదాలు గుర్తొచ్చాయి. అవి గుర్తొచ్చేసరికి మనసంతా ఏదోలా



అయిపోయింది. వాళ్లు ఆ పాదాల్ని గానీ ఒక్కసారయినా చూస్తే ఇంకేమయినా ఉందా...! అస్సలు తట్టుకోలేరు... ఎలాగా అని ఆలోచించసాగాను.

అప్పటికి బయట వాతావరణం కూడా శాంతించింది. అయినా ఆ ఇంటి తలుపులు మాత్రం ఏదో శక్తి శాసిస్తున్నట్టుగా విసురుగా కొట్టుకుంటున్నాయి. నేను ఎందుకయినా మంచిదని నా పాదాలు కనిపించకుండా చీరతో బాగా కవర్ చేసేసుకున్నాను.


ఇంతలో సుమ నా పక్కకి వచ్చి నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని ''అక్కా... వెళ్లి బట్టలు మార్చుకో... వసంతక్క బట్టలు నీకు ఓకేనా'' అంది. నేను అవునూ కాదూల మధ్య తలూపాను. ఎందుకంటే వాళ్ళంతా నేను వసంత ఫ్రెండ్‌నే అనుకుంటున్నారు.

ఇంతలో సుమ చనువుగా నన్ను వసంత గది దగ్గరికి తీసుకువెళ్లి లోపలకెళ్లి వసంత బట్టలు కట్టుకుని రమ్మంది. ఇక నేను చేసేదేమీ లేక ఆ గదిలోకెళ్లి అక్కడున్న బీరువాలోని వసంత బట్టల్లోంచి నా కిష్టమయిన తెలుపు రంగు బట్టలు కట్టుకుని బయటికి వచ్చాను.

ఈలోపు సుజాత అందరికీ టేబుల్ మీద భోజనాలు వడ్డించేసింది. టేబుల్‌కి ఓవైపు రఘురామ్, సుజాత కూర్చున్నారు. నాకు చెరోపక్కనా సుమ, భరత్ చేరిపోయారు. వాళ్ళిద్దరికీ ఒక్కక్షణం పడేలాలేదు. పడటం లేదంటే ద్వేషంతో కాదు, మితిమీరిన చనువుతో... మొత్తానికి ఇద్దరూ పోటీపడి నాకు వద్దన్నా తినిపించినంత పనిచేసారు. ఆ ఆప్యాయతలు చూసి నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. హఠాత్తుగా నాకు మా అత్తవారిల్లు గుర్తొచ్చింది. పెళ్ళయిన ఇన్నాళ్ళలో భోజనం చేసేవా అని అక్కడ అడిగిన వాళ్లే లేరు....

ఈలోపు సుమ పక్కనుంచి ''చూడక్కా... ఈ తాడిగాడు నన్నెప్పుడూ ఎలా ఏడిపించేస్తున్నాడో... వసంతక్క ఉంటే మేమిద్దరం కలిసి వీడి పని పట్టేవాళ్ళం'' అంది కంప్లయింట్ చేస్తున్నట్టుగా. దాంతో భరత్ కూడా తనేం తక్కువ తినలేదన్నట్టుగా ''అదేం కాదక్కా.. అంతా అబద్ధం. ఇదే నాకు నిక్‌నేమ్స్ పెట్టి ఏడిపిస్తుంది. ఇంట్లో అందరి కంటే చిన్నది కదాని అందరూ దీనికే సపోర్ట్'' అన్నాడు. వాళ్ళిద్దరి తగాదాలు చూస్తుంటే నాకు చాలా ముచ్చటగా అన్పించింది.

భోజనాలయ్యాక అందరూ సోఫాలో కూర్చున్నాం. అందరూ ఏవో మాట్లాడుతూనే ఉన్నారు. నన్నెవరూ పరాయిదానిలా చూడటంలేదు. తమ ఇంట్లో బిడ్డలాగే చూస్తున్నారు. ''నిన్ను చూస్తుంటే మా వసంతని చూసినట్టే ఉంది. తను ఎప్పుడూ మాకు దూరంగా ఉద్యోగాలంటూ తిరుగుతూ ఉంటుంది. వసంత వచ్చేవరకూ నువ్విక్కడే ఉండమ్మా'' అన్నారు రఘురామ్ దంపతులు. నా మనసంతా అపురూపమయిన భావన కలిగింది. అవుననబోయాను. అంతలోనే గుర్తొచ్చింది.... తెల్లవారితే ఎలా?....



అర్ధరాత్రి దాకా అలా మాట్లాడుతూనే ఉన్నాం. నాకయితే ఇంకా ఎంత సేపయినా వాళ్లతో అలా మాట్లాడుతూనే ఉండాలనిపించింది. ఇంతలో సుజాత ''పడుకోమ్మా... చాలా రాత్రయింది'' అంది. నేను తలూపి అంతకుముందు బట్టలు మార్చుకున్న గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాను. ఓసారి బద్ధకంగా వొళ్ళు విరుచుకున్నా. తర్వాతెళ్ళి కిటికీ దగ్గర నిలబడి బయటికి చూసాను. బయటంతా చీకటిగా ఉంది. ఆ చీకట్లో ఇంటి ముందున్న చింతచెట్టు మాత్రం ఇంకా భయంకరంగా ఉంది. తర్వాత ఓసారి నా పాదాలవంక చూసుకున్నాను. వాటిని చూస్తుంటే నాకే భయమేస్తోంది. ఒకప్పుడు ఎలా ఉండేవని!.... ఆలోచనలతో నెమ్మదిగా మంచం మీదకి చేరాను.

అలా మంచంమీద పడుకున్న తరువాత నెమ్మదిగా తలతిప్పి గోడవైపు చూసి ఉలిక్కపడ్డాను. మరుక్షణం గొంతు తడారిపోయింది. దానిక్కారణం గోడ మీద కనిపిస్తున్న ఆంజనేయస్వామి ఫోటో. ఆ ఫోటోని చూస్తుంటే నాలో శక్తిని ఎవరో పీల్చేసినట్టుగా ఉంది. మొహమంతా చెమటలు పట్టేస్తున్నాయి. అక్కడ్నుంచి బయటికి పారిపోవాలన్న కోరిక ఎక్కువైపోయింది. ఇంతలో బయట్నుంచి విసురుగా గాలి వీచేసరికి ఆ ఫోటో కాస్త వెనక్కి తిరగబడిపోయింది. అప్పటికి నేను తేరుకున్నాను. నెమ్మదిగా మామూలయ్యాను. ఇంకేం ఆలోచనలూ పెట్టుకోకుండా కళ్లుమూసి పడుకున్నాను. ఎప్పటికో నిద్ర పట్టింది. ఆ నిద్రలో ఏదో కలొచ్చింది.

***

''అబ్బే.... అమ్మ ఒప్పుకోవడం లేదు సంధ్యా... తన సంగతి నీకు తెలుసుగా.. నువ్వెలాగయినా మీ పుట్టింటినుంచి ఇంకో లక్షన్నా పట్టుకు రావాలసిందే'' అన్నాడు ఆనంద్. సంధ్య బేలగా చూసి ''ఎలాగండీ... ఇస్తామన్న కట్నమంతా మా నాన్న ఇచ్చేసాడు కదండీ. అంతా ఇచ్చాక కూడా ఇంకో లక్ష అడిగారు. దానికీ మా నాన్న ఒప్పుకున్నాడు. అయితే అనుకోకుండా ఆయనకి హార్ట్ ఎటాక్ వచ్చి పోవడంతో ఇవ్వలేకపోయాడు'' అంది. ఈసారి ఆనంద్ సలహా ఇస్తున్నట్టుగా ''మరి మీ నాన్న రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వస్తాయి కదా'' అన్నాడు. సంధ్య తల అడ్డంగా

ఊపి ''ఎలాగండీ... అవన్నీ మా అన్నయ్యల కెళిపోతాయి కదా... వాళ్ళ పరిస్థితీ అంతంత మాత్రమే'' అంది. ఆమె మాట పూర్తయ్యేలోపు లోపల్నుంచి విసురుగా దేవిక వచ్చింది. వస్తూనే ఆనంద్ వైపు తిరిగి ''ఏరా... దీన్ని బతిమాలుతున్నావా... ఆ లక్షా నా చేతిలో పడితే గానీ దీన్ని బయటికి పంపను. ఆ తైతెక్కలెలా ఆడుతుందో చూస్తాను'' అంది. దాంతో సంధ్య గుండెల్లో రాయి పడింది. తను ఎప్పట్నించో డాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నది రేపు ప్రదర్శన ఇవ్వడం కోసమే. దాంతో బ్రతిమాలుతున్నట్టుగా ''అంత మాటనకండి అత్తయ్యా.... నా డాన్స్ ప్రోగ్రామ్ ఆపొద్దు. ప్లీజ్'' అంది దీనంగా. అయినా దేవిక ఎంత మాత్రం వినిపించుకోకుండా లోపలికెళ్లిపోయింది. ఆనంద్ మాటలు మరిచిపోయినట్టుండిపోయాడు. దాంతో సంధ్యకి పరిస్థితి అర్థమయిపోయింది. ఆనంద్ వైపు తిరిగి ''ఇదిగో చూడండి. మీరంతా వద్దన్నా రేపు నేను డాన్స్ చేసి తీరతాను. అదంటే నాకు ప్రాణం'' అంది స్థిరంగా.

***

సంధ్యకి హఠాత్తుగా మెలకువొచ్చింది. దానిక్కారణం తన గదిలో ఏవో గుసగుసలు వినిపించడమే. నెమ్మదిగా కళ్ళు తెరిచింది. ఎదురుగా తన అత్తమామలు, ఆడపడుచు కనిపించారు. ఇంతలో దేవిక ''ఏవే... డబ్బులు తేవడం తెలీదు గానీ తైతక్కలాడటం తెలుసా... ఎలా ఆడతావో నేనూ చూస్తా'' అంది. దాంతో సంధ్య మనసు కీడు శంకించింది. గబుక్కున మంచం మీదనుంచి లేవబోయింది.

అప్పుడు జరిగింది.. మూకుడులో తమ కూడా తెచ్చిన వేడివేడి నూనెని అంతా కలిసి సంధ్య పాదాల మీద పోసేశారు. దాంతో ఒక్కసారిగా సంధ్య గుండె లవిసిపోయేలా కేకలు పెట్టసాగింది. అయినా వాళ్లు అదేం పట్టించుకోలేదు. ఆమెని బలవంతంగా లాక్కెళ్ళి స్టోర్ రూమ్‌లో పడేసి తలుపులేసేశారు.

***

స్టోర్ రూమ్...

చీకటిగా ఉంది. చిన్న డిమ్ లైట్ వెలుగుతుందంతే. గదంతా దుమ్ము రుకుపోయి ఉంది. పాత సామాన్లేవో ఉన్నాయి. గోడమీద ఆంజనేయస్వామి ఫొటో ఉంది. ఆ వాతావరణంలో ఇమడలేక సంధ్య షాకయిపోయింది. బుర్ర మొద్దుబారి పోయినట్టయింది. ఓ పక్కన బొబ్బలెక్కిపోయిన కాళ్లు... ఇంకో పక్క ఆ వాతావరణం. ఆమెకి పిచ్చెక్కేలా ఉంది. అలా ఎంతసేపు చూసినా ఆ గదిలో పాత సామాన్లు, గోడమీద ఆంజనేయస్వామి ఫొటో తప్ప వేరే ఏంలేవు. అలా గంటల తరబడి వాటిని చూస్తుంటే ఆమెలో భయం పెరిగిపోసాగింది. ఇంకొంచెం సేపు అలాగే గడిస్తే తనకి పిచ్చెక్కడం ఖాయమని ఆమెకి అర్థమయిపోయింది. మొత్తానికి తెగించి ఓ వైపున్న కిటికీ తలుపులు బద్దలు కొట్టి బయటపడింది. అక్కడ్నుంచి బయటికి పారిపోయింది.

***

హఠాత్తుగా నాకు మెలకువొచ్చింది. చటుక్కున లేచి కూర్చున్నాను. ఒళ్ళంతా చెమటలు పట్టేసింది. ఇదేంటీ... జరిగిందంతా మళ్లీ కలలా వచ్చిందేంటా అనుకున్నా. అసలా కల తల్చుకొంటూనే వొళ్లు జలదరిస్తోంది. దానికి తోడు బొబ్బలెక్కిపోయిన పాదాలు, ఓసారి తలతిప్పి బయటికి చూసాను. అప్పటికే తెల్లగా తెల్లవారి పోయింది. ఆవులిస్తూ నా రూమ్ లోంచి బయటకొచ్చాను. ఎవరూ కనిపించలేదు. ''సుమా... సుమా...'' అంటూ పిలిచాను. ఎవరూ పలకలేదు. అంతా లోపలెక్కడో ఉన్నట్టున్నారు. దాంతో నేను వీధి గుమ్మం తలుపు తీసి ఇంటి అరుగు మీద కొచ్చి నిలబడ్డాను.

ఓసారి చుట్టూ చూశాను. కనుచూపు మేరలో మనుష్య సంచారం కనిపించడం లేదు. దూరంగా ఎక్కడో పశువులు మేపుకుంటున్న ఓ ముసలతను కనిపించాడు. అయితే అతడు నావైపు పట్టిపట్టి చూస్తున్నట్టుగా అనిపించింది. అంతేగానీ దగ్గరికి వచ్చే ప్రయత్నమేదీ చేయడంలేదు. నేను కూడా ఈ ముసలాడి వ్యవహారం ఏంటా అని చూడసాగాను. చాలాసేపు అలా గుచ్చిగుచ్చి చూసి అప్పుడు నడుచుకుంటూ నా దగ్గరకొచ్చి ''ఏం తల్లీ.. ఎవర్నువ్వు?'' అంటూ అడిగాడు. దాంతో నేను ''నేనా తాతా... నాపేరు సంధ్య. ఓ ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి పారిపోతూ లైట్లు వెలుగుతున్నాయి కదాని రాత్రి ఈ ఇంటిలో దూరా. ఆ ఇంటివాళ్లు చాలా మంచోళ్లు. నన్ను చాలా బాగా చూసుకున్నారు'' అన్నాను.

నేనలా అనేసరికి ఆ ముసలతని మొహంలో భయం ప్రవేశించింది. ''ఏంటీ! ఈ ఇంట్లో వాళ్లా! అసలు ఈ ఇంట్లో ఎవరూ ఉండటం లేదే. పాపం ఏదో ఏక్సిడెంట్‌లో ఆ ఇంట్లో నలుగురు చచ్చిపోయారు. పెద్దమ్మాయి ఒక్కతే మిగిలింది. ఆ అమ్మాయి కూడా ఇప్పుడా ఇంట్లో ఉండటం లేదు. ఎక్కడో ఉద్యోగం చేసుకుంటోంది. ఆ చచ్చిపోయినోళ్లు చాలా మంచోళ్ళమ్మా. ఆళ్ళే మమతలు చావక రాత్రుళ్ళు ఆ ఇంటిలో తిరుగుతుంటారని చెప్పుకుంటారు'' అన్నాడు. ఆ మాటలు వినేసరికి నా గుండె జల్లుమంది. గబగబా ఇంటి లోపలికి పరిగెత్తాను. ఓసారి ఇల్లంతా తిరిగాను. ఇంటిలో ఎవరూ లేరు. రెండో బెడ్‌రూమ్‌లోకి పరిగెత్తా, అక్కడ గోడకి నలుగురి ఫొటోలూ దండేసి ఉన్నాయి. ఒక్కసారిగా మనసంతా వికలమైపోయింది. బరువెక్కిన హృదయంతో బయటికి నడిచాను.

***

''ఏమే... రాత్రంతా ఎవడితో ఉన్నావే?'' అంటూ గుమ్మంలోనే ప్రశ్న ఎదురయింది. ఇంతకీ ఆ ప్రశ్న వేసింది నా అత్త దేవిక. నేను ఏం మాట్లాడలేదు. ఆ పక్కనుంచి ఆనంద్ ''అదికాదు సంధ్యా... నువ్విలా రాత్రుళ్లు నీ ఇష్టానుసారం బయటకు తిరిగితే ఎలా?'' అంటూ అడిగాడు. దాంతో నా మనసు చివుక్కుమంది. చేసిందంతా వీళ్లు చేసేసి ఇప్పుడు నన్నిలా అంటున్నారేంటా అనుకున్నాను. 'డాన్స్ చేయకుండా కాళ్ళ మీద వేడినూనె పోసి, తర్వాత స్టోర్‌రూమ్‌లో పడేసి, ఇక గత్యంతరం లేక తను తప్పించుకున్నందుకు ఇలా అంటారా' అనిపించింది. ఈలోపు మా మామ ఎంతో ఉదారంగా ''ఏయ్.. ఇంకోసారి గడప దాటితే తోలు తీసేస్తాను. లోపలికి తగలడు'' అన్నాడు. అతగాడు అలా అనేసరికి అందరూ గుమ్మానికి అడ్డం తొలిగారు. నేను మళ్ళీ ఆ నరక కూపంలోనికి అడుగుపెట్టాను.

***

వారం తర్వాత ఓరోజు...

అర్ధరాత్రి కావస్తోంది.

ఊరి చివరన ఉన్న ఆ ఇంటి దగ్గర బెల్ కొట్టాను. లోపలెక్కడో బెల్ మోగుతున్న శబ్దం వినిపించింది. ఇంతలోనే తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా రఘురామ్... అదే ఆప్యాయత నిండిన మొహం. ఈలోపు లోపల నుంచి సుజాత, సుమ, భరత్ గబగబా వచ్చేసారు. నేను రావడంతో వాళ్ల మొహాల్లో చాలా సంతోషం కన్పించింది. ''అక్కా.... నువ్వు మళ్లీ వస్తావని మాకు తెలుసు'' అన్నాడు భరత్. ఈలోపు సుమ నన్ను చేతులు పట్టుకుని లోపలికి తీసుకెళ్లిపోయింది.

వాళ్లెవరో నాకిప్పుడు బాగా తెలుసు. అయినా నాకు ఏం భయమేయలేదు. వాళ్ళ మధ్య ఆ మమతల నిలయంలో నేను ఎప్పటికీ ఆనందంగా ఉండగలనని నాకు తెలుసు. ఓసారి అందరినీ ఆప్యాయంగా పలకరించి తర్వాత బట్టలు మార్చుకోవడానికి నేరుగా వసంత గదిలోకి వెళ్లిపోయాను.

*

రచయిత సెల్ నెం: 90003 36677

